

అధికార పార్టీ నేతలకు షాక్..!

అధికార పార్టీనేతల ఆగడాలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ఇసుక, గ్రావెల్, మట్టి, తదితర విషయాల్లో జోరుమీదున్న ఆ పార్టీ నేతలు పేద గిరిజనుల నోటివద్ద కూడు తీసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో 1800చెరువుల్లో ఇరిగేషన్, పంచాయతీరాజ్, చిన్న, పెద్ద ప్రాజెక్టులున్నాయి. మత్స్యకార సొసైటీ పేరుతో చేపలు పెంచి ఆసభ్యులు చేపలు పట్టుకుంటారు. మత్స్య సంపద వారికి దక్కకుండా వేలం వేసి అధికార పార్టీ నేతలు కొట్టేయాలని చూస్తున్నారు. మూడేళ్ల నుంచి ఇదే తంతు జరుగుతుంది. తాజాగా 15 చెరువుల వేలం వేయడాన్ని రద్దు చేస్తూ మంగళవారం హైకోర్టు స్టే విధించింది. ఈ నిర్ణయంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- ❍చెరువుల వేలంపై హైకోర్టు స్టే
- ❍గిరిజనుల్లో ఆనందం
- ❍మూడేళ్ల నుంచి ఇదే పద్ధతి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

పేద గిరిజనుల అభ్యున్నతి కోసం వారు ఆర్థికంగా బలపడడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుంది. అందులో భాగంగా గిరిజనులు, ఇతర పేదలతో మత్స్యకార సొసైటీ ఏర్పాటు చేసి చెరువుల్లో చేపలు పెంచుతున్నారు. ప్రధానమైన రిజర్వాయర్లు, చెరువుల్లో భారీ మత్స్య సంపద ఉంది. జిల్లా వ్యాపితంగా సుమారు రూ.150 కోట నుంచి రూ.200కోట్లు విలువైన చేపలు ఉన్నట్లు అంచనా.వీటిని సొసైటీ సభ్యులకు ఇస్తే చేపలు పట్టుకొని కొంత ప్రభుత్వానికి చెల్లిస్తారు. ఈ మత్స్య సంపదపై కన్నేసిన అధికార పార్టీ నేతలు కొందరు మూడేళ్ల నుంచి టెండర్లు నిర్వహించి కొట్టేయాలని విలువైన మత్స్య సంపదను కొల్లగొట్టాలని చూస్తున్నారు. ఏడాది క్రితం కావలి అధికార పార్టీకి చెందిన ఓ నేత 27చెరువులకు టెండర్లు పిలిచే విధంగా ఏర్పాటు చేసుకున్నారు. ఆ రోజు (ప్రజాశక్తి) పలు కథనాలు ప్రచురించింది. మత్స్యకార సంఘాలు, యానాది సంక్షేమ సంఘం, కొన్ని రాజకీయ పార్టీలు కోర్టుకెళ్లి స్టే తెచ్చారు. అప్పటి నుంచి వేలం నిలిచిపోయింది. ప్రస్తుతం సోమశిల, కండలేరు, కనిగిరి రిజర్వాయర్లలో 5నుంచి 20కిలోల చేపలున్నట్లు తెలుస్తోంది. వీటిని ఎలాగైనా

కండలేరు జలాశయం..

కాజేయాలనుకున్న అధికార పార్టీ నేతలకు హైకోర్టు షాక్ ఇచ్చింది. టెండర్లు రద్దు చేసింది.

వేలం టెండర్లు రద్దు

జిల్లా ఇరిగేషన్ శాఖ అధికారులు జిల్లాలోని 15చెరువులను 17.68కోట్లకు వేలం వేయడానికి ఈ నెల 14నుంచి 21వరకు ఇ.కొనుగోలు వేలం ఇచ్చారు. 20తేదీ టెండర్లు ఓపెన్ చేయాల్సి ఉంది. కావలి పెద్ద చెరువు రూ.27లక్షలు, చెన్నాయపాళెం రూ.47. 28 లక్షలు, అల్లూరు రూ.44.29లక్షలు, సంగపేట రూ.27.07లక్షలు, తురిమెర్ల రూ.58.39లక్షలు, పెదపుత్తేడు రూ.60. 24లక్షలు, చిన్నక్రాక రూ.29.99, సోమవరప్పాడు రూ.27.16, అనంతసాగరం రూ.1.63కోట్లు, కలువాయి రూ.55.23, గండిపాళెం రూ.69.69, రూ. వీరన్న కనుపూరు రూ.27.31, పూడి రూ.17.71, కనిగిరి రిజర్వాయర్ రూ.3.40కోట్లు, కండలేరు జలాశయం రూ.8.36కోట్లు ఇరిగేషన్ అధికారులు టెండర్లు పిలిచారు. దీన్ని నిరసిస్తూ యానాది సంక్షేమ సంఘం, మత్స్యకార కార్మిక సంఘాలు, పలు గిరిజన సంఘాలు పలు రాజకీయ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. గిరిజనులు హైకోర్టుకెళ్లారు. దీన్ని పరిశీలించిన హైకోర్టు టెండర్లు రద్దు చేయాలని ఆదేశించింది. ఈ నిర్ణయం పట్ల గిరిజన సంఘాలు ఆనందం వ్యక్తం చేశాయి. అధికార పార్టీ నేతలు ఢీలా పడ్డారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై

పోరాడేది పీడీఎఫ్ ఎంఎల్‌సిలే..!

పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై గళం విప్పేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలేనని పిడిఎఫ్ బలపర్చిన తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి పేర్కొన్నారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేర్ల సమావేశంలో మీగడ వెంకటేశ్వర రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు ప్రక్రియలో రాజకీయ పార్టీలు అడ్డగోలుగా వ్యవహరించాయని విమర్శిం చారు. తూర్పు రాయలసీమ నియోజకవర్గ పరిధిలో ఈనెల 5వ తేదీ నాటికి 2.66 లక్షల దరఖాస్తులు వస్తే 7వ తేదీ నాటికి 4.18 లక్షల దరఖాస్తులు దాఖల య్యాయ న్నారు. సుమారు 1.50 లక్షల దరఖాస్తులు ఒక్క రోజులోనే వచ్చాయని, అధికార పార్టీ వాలంటీర్ల ద్వారా, ప్రతిపక్ష పార్టీ పెద్ద సంఖ్యలో దరఖాస్తులు ఇచ్చిందన్నారు. ఈ విషయమై ఎన్నికల సంఘానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఫిర్యాదు చేశారన్నారు. రాష్ట్రంలో 60 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు, 2.45 లక్షల మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తు న్నారని, వీరికి ఉద్యోగ భద్రత లేదన్నారు. పంజాబ్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్‌లలో సిపిఎస్‌ను రద్దు చేశారని, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ గెలిస్తే సిపిఎస్ రద్దు చేస్తామని ప్రియాంక గాంధీ, గుజరాత్‌లో ఆప్ గెలిస్తే సిపిఎస్ రద్దు చేస్తామని సిఎం కేజ్రీవాల్ ప్రకటిం చారన్నారు. పాదయాత్ర సమయంలో సిపిఎస్‌ను రద్దు చేస్తామని సిఎం ప్రకటించి మూడేళ్ళు అవుతున్నా జాప్యంపై సిఎం జగన్మోహన్ రెడ్డి సమాధానం చెప్పాల న్నారు. ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు ఎప్పుడూ ఉండేవని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. పిఆర్‌సి, డిఏ అరియర్స్, విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన డిఏ అరియర్స్ చెల్లించాలన్నారు. ఉద్యోగులు ప్రజలలో భాగమనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. తాను ఎమ్మెల్సీగా గెలిస్తే ఉద్యోగ, ఉపాధ్యాయ, రైతులు, నిరుద్యోగులు, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఎస్‌ఐ, గ్రూపు-3, 4 పోస్టులను విడుదల చేయాల న్నారు. ఎపి రెసిడెన్షియల్, గిరిజన పాఠ శాలలు, కెజిబివిలలో పనిచేస్తున్న సిఆర్‌టి, పిజిటిల సమస్యలపై చర్చిస్తామన్నారు. పిఆర్‌సి అమలు చేసి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఓవి వీరారెడ్డి, ఎస్.రవి, సహాధ్యక్షురాలు జి.ఉమా మహేశ్వరి, కోశాధికారి కె.లక్ష్మినారాయణ, బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.శ్రీనివాసరావు, సిపిఎస్ ఉద్యోగుల జిల్లా కన్వీనర్ షేక్ అబ్దుల్ హై పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మీగడ వెంకటేశ్వరరెడ్డి

ఉపాధ్యాయుల పట్ల పభుత్వం నిరంకుశ వైఖరి

ఎంఎల్‌సి విటపు బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల అత్యంత నిరంకుశ వైఖరిని అవలంభిస్తుందని, ప్రభుత్వ ఉద్యోగులు కడుపు నిండిన వారే కాబట్టి ప్రభుత్వం ఎప్పుడు ఇస్తే అప్పుడు తీసుకొని జీవించాలన్న ధోరణితో ప్రభుత్వం మొండి వైఖరి అవలంభిస్తుందని ఎంఎల్‌సి విటపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలంటూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఒక్క రోజు ధర్నా శిభిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అవలంభిస్తున్న ఆర్థిక విధానాలకంటే ఉద్యోగులపట్ల వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గంగా ఉందన్నారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వ రాజకీయ విధానమే దారుణంగా ఉందని, ఉపాధ్యాయులు ఆత్మాభిమానం చంపుకోలేక ప్రభుత్వంతో పోరాటం చేస్తున్నారన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఉపాధ్యాయుల హక్కులను సాధించి తీరుతామని, ప్రభుత్వ మెడలు వంచి తీరుతామన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన హక్కులు, ఇవ్వాల్సిన రాయితీలు అందజేయకపోగా రెచ్చగొట్టే విధంగా ప్రభుత్వం మాట్లాడటం సరికాదన్నారు. ఉపాధ్యాయులు ప్రభుత్వానికి గొంతెమ్మ కోర్కెలు కోరడంలేదని, ఉపాధ్యాయులు గతంలో కోరిన కోర్కెలను అందరి ఆమోదంతోనే తీర్మానించి, ప్రభుత్వంతో స్నేహపూర్వకంగా ఉండాలని ఇటీవల ప్రభుత్వ సలహాదారుడు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో సాక్షాత్తు మంత్రులే చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వాస్తవానికి ప్రభుత్వానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు చెల్లిస్తున్న ప్రావిడెంట్ ఫండ్ నగదు ఎక్కడకు పోయిందని, ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ.8 వందలా 50 కోట్లు వాడుకుందన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీంకు చెందిన వంద కోట్లకు పైగా ప్రభుత్వం ఖర్చు చేసుకుందన్నారు. ఉద్యోగుల కష్టార్జితం, దాచుకున్న మొత్తం, ఉద్యోగులకు అవసరమైన సమయంలో వాడుకొనేందుకు అనుకూలంగా ఉన్న ఖాతాల్లోని నగదును ప్రభుత్వం దారి మళ్లించి రకరకాలుగా ఉపయోగించిందన్నారు. ఇవే కాకుండా సిపిఎస్ నగదు దాదాపు 8 నెలల నుంచి ప్రభుత్వం చెల్లించాల్సిన నగదు, ఉద్యోగుల చెల్లించిన నగదు మొత్తం ఎటుపోయిందో అర్థం కాని పరిస్థితి అన్నారు. పభుత్వం కష్టాల్లో ఉంది కాబట్టి వాడుకున్నామని, పేద ప్రజల కోసం వాడుకున్నామని,డిసెంబరు 31వ తేదిలోపల తిరిగి జమచేస్తామని చెప్పిందన్నారు. ప్రభుత్వం నిజంగా జమచేస్తుందా.. జమచేసేందుకు ప్రభుత్వం వద్ద బడ్జెట్ ఉందా.. లేకపోతే ప్రభుత్వానికి గుప్తనిధులేమైనా దొరికాయా అన్నది అర్థం కాలేదన్నారు. మాటలతో, సంప్రదింపులతో తమ సమస్య పరిష్కారం లభించే విధంగా లేకు కాబట్టి ఈ పోరాటానికి పిలుపు నిచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఆయా జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ధర్నా అనంతరం కలెక్టరేట్‌లోని అధికారులకు యూటిఎఫ్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్. నవకోటేశ్వరరావు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవి.చలపతి శర్మ, వి.వి.శేషులు గౌరవాధ్యక్షులు కే.తులసిరాంబాబు,అసోసియేట్ అధ్యక్షులు ఎంసి అచ్చయ్య,కోశాధికారి ఎ.మురళీధరరావు, యుటిఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్షులు జిజె రాజశేఖర్ ,గౌరవాధ్యక్షులు కె.శేఖర్ జిల్లా కార్యదర్శులు, రాష్ట్రకౌన్సిలర్స్,మండలశాఖల అద్యక్ష,ప్రధాన కార్యదర్శులు అధికసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఎంఎల్‌సి విటపు బాలసుబ్రమణ్యం

అభివృద్ధి పనులు పూర్తి చేశాం..

మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి -పొదలకూరు

సర్వేపల్లి నియోజకవర్గంలో గత ప్రభుత్వం శిలాఫలకాలు, శంకుస్థాపనలతో.. వదిలేస్తే తమ ప్రభుత్వం వాటినిపూర్తిచేసి ప్రారంభోత్సవాలు చేస్తుందని వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు పంచాయతీలో ఏడో రోజు మంగళవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని తోకంచి, చిట్టేపల్లి గ్రామాల్లో కొనసాగించారు. ఆయన మాట్లాడుతూ పొదలకూరు పంచాయతీలో ఏడు రోజుల్లో 10 కోట్ల 27 లక్షల రూపాయల అభివద్ధి పనులకు ప్రారంభోత్సవాలు జరిపినట్లు తెలిపారు. దీన్నిబట్టి చూస్తే తమ పాలనలో అభివద్ధి ఏ స్థాయిలో, ఏ విధంగా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చున్నారు. ప్రతి కుటుంబం జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాల పట్ల సంతప్తిని వ్యక్తం చేస్తుందన్నారు. నూటికి నూరు శాతం మార్కులు వేస్తున్నట్లు చెప్పారు. పొదలకూరు జడ్పిటిసి తెనాలి నిర్మలమ్మ, మండల ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, వైకాపా నాయకులు గోగిరెడ్డి గోపాల్ రెడ్డి, కోణం చిన్న బ్రహ్మయ్య పెద్దమల్ల రమణారెడ్డి, వాకాటి శ్రీనివాస్ రెడ్డి, ఎం. శేఖర్ మద్ది రెడ్డి ,రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి కాకాణి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-లింగసముద్రం :అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం లింగస ముద్రంలోని సచివాల యం-1 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. పంచాయతీలోని బిసి కాలనీలో సైడు కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, కాలువలు పూడిపోవడం వల్ల వర్షం పడినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఎంఎల్‌ఎ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన పూడికను తీయాలని పంచాయితీ కార్యదర్శికు చెప్పారు. తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ పలువురు నుంచి అర్జీలు స్వీకరించారు. మండల పరిషత్ అధ్యక్షులు పెన్నా కృష్ణయ్య, జెడ్‌పిటిసి సభ్యురాలు డాక్టర్ చెన్ను నళిని పద్మ, వైసిపి మండల కన్వీనర్ పిచ్చపాటి తిరుపతిరెడ్డి, వైసిపి మండల మీడియా కన్వీనర్ వరికూటి కృష్ణారెడ్డి, తహశీల్దార్ సుధాకర్, ఎంపిడిఒ చంద్రసేన్, సర్పంచ్ పులి రాఘవులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎంఎల్‌ఎ మహీధర్‌రెడ్డి

కుడి కాలువకు నీరు విడుదల

ప్రజాశక్తి-లింగసముద్రం :రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువకు 30 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టు అధికారులు విడుదల చేశారు. మంగళవారం ప్రాజెక్టు డిఇ లక్ష్మినారాయణ నీటిని కాలువకు విడుదల చేశారు. చినపవని రైతులు అడగడంతో నీటిని విడుదల చేసినట్లు అధికారులు చెబుతున్నారు. రాళ్లపాడు ప్రాజెక్టులో ప్రస్తుతం 16.3 అడుగుల నీటిమట్టం ఉంది.ప్రాజెక్టు ఎఇలు చంద్రమౌళి, పూర్ణ, సింధు పాల్గొన్నారు.

మంచి నీటి పథకాలు పరిశీలన

ప్రజాశక్తి - లింగసముద్రం : రాళ్లపాడు ప్రాజెక్టు ఆధారంగా నిర్వహిస్తున్న మంచినీటి పథకాలను ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్.ఇ గురు ప్రసాద్ పరిశీలించారు.మంగళవారం ఆయన అధికారులతో కలిసి రాళ్లపాడు-రోళ్లపాడు, గుడ్లూరు ఫేజ్-1,2 పథకాలను పరిశీలించిన తరువాత వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందించే నీటిని పరిశుభ్రంగా ఇవ్వాలని చెప్పారు. డిఇ రామ్‌మోహన్, ఎఇలు రాజశేఖర్, సాగర్, కాంట్రాక్టర్ వరికూటి క్రిష్ణారెడ్డి, మధు పాల్గొన్నారు.

మంచినీటి పథకాలను పరిశీలిస్తున్న ఎస్ఇ

బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కందుకూరు : మండలంలోని అంగిరేకులపాడు గ్రామానికి చెందిన గంటా శ్రీను ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స అనంతరం హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. శ్రీను కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు కుటుంబాన్ని ఆదుకునేందుకు నిర్ణయించారు. గ్రామానికి చెందిన అల్లం సుబ్బారావు, అల్లం వెంకటేశ్వర్లు ద్వారా శ్రీనుకు 20వేల రూపాయలు ఆర్థిక సాయం అందించేలా ఏర్పాటు చేశారు. బాధితుడు గంటా శ్రీను కుటుంబ సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు కతజ్ఞతలు తెలిపారు.

పశువైద్య సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు డివిజనల్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని పశు వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆడ దూడలు జననం, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కత్రిమ గర్భధారణ ద్వారా ఆడ దూడలు పుట్టే కార్యక్రమం ప్రారంభించారు, రెండు కత్రిమ గర్భధారణ వీర్య నాళికలు ఖరీదు రూ.1350 ప్రభుత్వ సబ్సిడీ రూ.850 రైతు చెల్లించాలన్నారు. రూ.500 ఒకవేళ కత్రిమ గర్భధారణ వల్ల గర్భం దాల్చకపోతే రైతు చెల్లించిన రూ.500 తిరిగి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఒంగోలు డిస్ట్రిక్ట్ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ కార్య నిర్వహణ అధికారి డాక్టర్ ఎస్‌కె కాలేషా, ఉప సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్ ఈ సందర్భంగా పశు వైద్యులకు, మండలంలో రైతు భరోసా కేంద్రంలో పనిచేస్తున్న పశు వైద్య సిబ్బందికి అవగాహనా కల్పించారు. కార్యక్రమంలో కందుకూరు పశు వైద్య శాల సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీధర్, మాచవరం పశు వైద్యులు డాక్టర్ ఇ.చెన్నకేశవులు, కోవూరు పశు వైద్యులు డాక్టర్ ఎస్. సుధాకర్, పాలూరు గ్రామీణ పశు వైద్య శాల డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్‌కె కాలేషా

కార్మిక సమస్యలపై పోరాటం : సిఐటియు

ప్రజాశక్తి -గుడ్లూరు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాల కారణంగా కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించడంలో పాలకులు, అధికారులు విఫలమయ్యాయని సిఐటియు జిల్లా అధ్యక్షులు టివివి ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఇక్కడ సిఐటియు గుడ్లూరు మండల ఐదో మహాసభ జరిగింది. ఈ సందర్భంగా టివివి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రావడానికి అనేక వాగ్దానాలు ఇచ్చి స్కీం వర్కర్ల, కార్మికుల ఓట్లు కొల్లగొట్టిందన్నారు. తీరా అధికారం చేపట్టిన తర్వాత సంక్షేమ పథకాలు రద్దు చేయడం, రేషన్ కార్డుల నురద్దు చేయడం, వెబ్ సైట్ లో ప్రభుత్వ ఉద్యోగులను చెప్పి వేతనాలను పెంచకుండా ఇచ్చే సంక్షేమ పథకాలను అన్నింటినీ రద్దు చేయడం దుర్మార్గమన్నారు. ఈ మహాసభలో సిఐటియు జిల్లా కార్యదర్శి జివిబి కుమార్ మాట్లాడుతూ గత మూడేళ్లుగా స్కీం వర్కర్లపై వేధింపులు కొనసాగు తున్నాయన్నారు. చాలీచాలని వేతనాలతో పని భారంతో, పెరిగిన ధరలతో స్కీం వర్కర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిరుద్యోగులపై వేధింపులు విడనాడి వారి సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలన్నారు. ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజా మాట్లాడారు.

నూతన కమిటీ ఎన్నిక

ఈ సందర్భంగా సిఐటియు గుడ్లూరు మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా ఎస్‌కె పద్మజ కొట్టే వెంకయ్య లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోశాధికారిగా బెడదం మాధవ, ఉపాధ్యక్షులుగా పర్రె తిరుపతమ్మ గడ్డం రాజేష్ లను, సహాయ కార్యదర్శులుగా డి రమాదేవి, పసుపులేటి కుమారిలను కమిటీ సభ్యులుగా పి.ఓంకార్, కె కోమలి, ఏ గీతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తొలుత సిఐటియు కందుకూరు డివిజన్ కార్యదర్శిగా పనిచేసిన ఎం మనోజ చిత్రపటానికి పూల మాలవేసి జోహార్లు అర్పించారు. సంతాపం ప్రకటించారు. ఈ మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు దువ్వూరి జాన్ సిఐటియు నాయకులు దమ్ము వెంకటేష్ దేవరాజీతం, కుమారి అమీరున్నిసా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు టివివి ప్రసాద్

'జెన్కో' నిర్వాసితులకు న్యాయం చేయండి

310వ రోజుకు చేరిన ఉద్యమం

ప్రజాశక్తి-ముత్తుకూరు

శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రానికి భూముల త్యాగం చేసిన నిర్వాసితులకు ఫర్మినెంట్ ఉద్యోగాలు ఎప్పుడు ఇస్తారని జెన్కో పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఎం మోహన్ రావు ప్రశ్నించారు. జెన్కో ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జరుగుతున్న ఉద్యమం 310వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మంగళవారం ఇక్కడ మహాధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ నాయకులతో కలిసి మాజీ మంత్రి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు. తొలుత పరిరక్షణ కమిటీ చైర్మన్ మోహన్ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జెన్కో కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలను సూక్తి ముక్తావళి గా ప్రతీ రోజు మైకులలో వినిపించాలని చెప్పారు. 310 రోజుల నుంచి నిరసన తెలుపుతుంటే ప్రభుత్వం స్పందిం చకపోవడం దారుణమన్నారు. పులివెందుల వారికోసం ప్రత్యేక జీవో ఇచ్చిన ముఖ్యమంత్రికి వేల ఎకరాలు బంగారు భూములు వదులుకుని కార్మికులుగా బతుకుతున్న ఇక్కడ వారు గుర్తుకు రాలేదా అని మోహన్ రావు ప్రశ్నించారు. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో పట్టు విడుపులు అవసరమని, జెన్కో ప్రయివేటీకరణ విషయంలో ముఖ్యమంత్రి వెనక్కు తగ్గాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్, సిపిఐ నాయకులు అంకయ్య, టిడిపి నాయకులు బొమ్మి సురేంద్ర, సిఐటియు నాయకులు గోగుల శ్రీనివాసులు, గడ్డం అంకయ్య, జెఏసి నాయకులు రవి, మోహన్ రావు, భాస్కర్, అనీల్ పాల్గొన్నారు.

ఇంజినీర్లు ఇన్నో వేటర్లుగా ఎదగాలి

ప్రజాశక్తి -కందుకూరు : ఇంజినీరింగ్ విద్యార్థి డిగ్రీ పొందేసరికి ఇన్నోవేటర్‌గా పరిణితి చెందాలని, విశిష్ట ఇన్నోవేషన్ సిఇఒ సాందీప్ అభిలాషించారు. రోబో అప్లికేషన్స్ వర్క్ షాప్‌లో నైపుణ్యం ప్రదర్శించిన వారికి ప్రోత్సాహకర బహుమతులను సంస్థ తరపున ప్రకటించారు. ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో విద్యార్థులకు బహు మతులను, ప్రశంసా పత్రాలను కరస్పాండెంట్ రామయ్య, టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కె విజయ్ శ్రీనివాసులు అందజేశారు. సాందీప్ మాట్లాడుతూ సాఫ్ట వేర్ రంగం కన్నా భవిష్యత్తులో ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ బ్రాంచి విద్యార్థులకు కోర్ రంగంలో ఉద్యోగావకాశాలు బాగా ఉంటాయన్నారు. వినూత్నం ఆలోచనలతో ముందుకు సాగితే ఇంజినీరింగ్ విద్యార్థుల భవిష్యత్ బంగారు బాటలేనన్నారు. కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ తమ విద్యార్థులు ఇతరుల కన్నా ఒక మెట్టు పైన ఉండాలన్న సంకల్పంతో కాలేజీ ప్రణాళికలు రూపొంది స్తుదన్నారు. విశ్వవిద్యాలయాలకు మాత్రమే పరి మితమైన కోడింగ్, ఎలక్ట్రికల్ టెక్ హబ్ తదితర క్లబ్‌లను ఏర్పాటుచేసి విద్యార్థులలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందిస్తున్నామని రామయ్య వెల్లడించారు. ప్రకాశం టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కె.విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ వర్క్‌షాపుల శిక్షణ తర్వాత ఆయా కిట్లను మూలన పడవే యకుండా నిరంతరం సాధన చేస్తే ఉన్నత స్థితికి చేరుకోవచ్చని ఉద్బోధించారు. 2-3 ఏళ్ల ఎలక్ట్రానిక్స్ విద్యార్థులు పలువురు సమావేశంలో మాట్లాడు తూ సబ్జెక్టులకే పరిమితమైన తమకు విశిష్ట ఇన్నోవేషన్ సిఇఒ శిక్షకులు సాంకేతికంగా బలోపేతం కావడానికి ఇచ్చిన శిక్షణ జీవితంలో మరువలేనిదని కతజ్ఞతలు తెలిపారు. ప్రతి సెమిస్టర్ కు ఒక వర్క్ షాప్ నిర్వహించేందుకు యాజమాన్యం దృష్టిపెట్టాల న్నారు. ప్రిన్సిపాల్ సి.హెచ్. రవికుమార్, రాకేష్, వి.కోటేశ్వరరావు, శ్రీకాంత్,మస్తాన్ వలీ విద్యార్థులను ప్రోత్సహించారు.

మాట్లాడుతున్న కంచర్ల రామయ్య

ఉలవపాడులో అన్నదానం

ప్రజాశక్తి-ఉలవపాడు : మండలంలోని కరేడులో ఓరుగంటమ్మ ఆలయ సమీపంలో 25 రోజులుగా అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మంగళవారం 26రోజు కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు అయ్యప్ప స్వాములకు బిక్ష ఏర్పాటు చేశారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు కన్నా ప్రసాదు, పార్టీ నాయకులు బంగారు రెడ్డి, పోలుబోయిన శ్రీనివాసులు, హరిబాబు, రామదాసు, బాలచంద్రరావు, వెంకటరమణ, శ్రీధర్, వెంకట్రావు, శ్రీను, బాలమురళి, కత్తి కొండయ్య, కత్తి మహేష్, కత్తి శ్రీహరి, వెంకట్రావు, రాచగర్ల శివ, పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మహిళలు

మద్యం షాపును తొలగించాలి : ఐద్వా

ప్రజాశక్తి -కందుకూరు :పట్టణంలోని విక్కిరాలపేట రోడ్డులో ఉన్న సుందరయ్య నగర్ వద్ద ఏర్పాటు చేసిన మద్యం షాపును వెంటనే తొలగించాలని ఐద్వా ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా జరిగింది. ఈ ధర్నానుద్దేశించి ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు ఎస్‌కె మున్వర్ సుల్తానా మాట్లాడుతూ నివాస ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న మద్యం షాపును తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కాలనీలో అనేకమంది పేదలు నివసిస్తున్నారని, మద్యం షాపు వల్ల అక్కడ ఇబ్బందులు వస్తాయని తెలిపారు. వెంటనే మద్యం షాపును తొలగించాలన్నారు. ఐద్వా పట్టణ కార్యదర్శి ఎస్‌కె మల్లికా మాట్లాడుతూ మహిళలు, చిన్నపిల్లలు స్కూల్లు ,మసీదులు, చర్చిలు ఉన్నాయని, ప్రశాంతమైన వాతావరణం మద్యం షాపు వల్ల చెడిపోతుందన్నారు. ఏ రోజుకు ఆరోజు కూలి పనులు చేసుకునే ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారన్నారు. ఇప్పటికే మద్యం వల్ల అనేక కుటుంబాల్లో సమస్యలు వస్తున్నాయన్నారు. ఇక్కడ షాపును తొలగించాలని డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్ శోభికాను కలిశారు. త్వరలోనే పరిశీలించి షాపుని ఖాళీ చేయిస్తామని ఆమె హామీనిచ్చారు. ఎస్‌కె అస్మా ,కుమారి ,ఎస్ కే షఫీ, ఫాతిమా ,ముంతాజ్ పాల్గొన్నారు.

చున్నీలను లాగడం దారుణం : టిడిపి

ప్రజాశక్తి -కందుకూరు :దిశ యాప్ ఎక్కడ ఉందో ఎటు పోయిందో తెలియదు.. అక్క చెల్లెమ్మలకు అండగా ఉంటాను అని దొంగ మాటలు చెప్పుకునే సిఎం జగన్మోహన్‌రెడ్డి నిజ స్వరూపం నరసాపురం సభ సాక్షిగా బయటపడిందని పట్టణ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి కల్లూరి శైలజ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఆడపడుచుల్ని సభా ప్రాంగణానికి బలవంతంగా తరలించడమే కాకుండా నల్ల చున్నీలు వేసుకున్నారనే నెపంతో చున్నీలు లాగేసుకొని సభా ప్రాంగణంలోకి పంపడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఇది ఆడపడుచుల్ని అవమానించడమేనన్నారు. ఇటువంటి చర్యలను ఖండిస్తు న్నామని, దీనిపై మహిళ కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ ఏమి చెబుతారని ప్రశ్నించారు.

జిల్లా స్థాయి క్రీడలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి -కందుకూరు

కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ 19 బాల, బాలికల హ్యాండ్ బాల్ , బాస్కెట్‌బాల్,త్రో బాల్ జట్ల ఎంపిక మంగళవారం జరిగింది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 80 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అత్యుత్తమ క్రీడా నైపుణ్యం కలిగిన క్రీడాకారులను ప్రకాశం జిల్లా జట్లకు ఎంపిక చేయడం జరిగింది. ఈ జట్లు త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి అండర్ 19 స్కూల్ గేమ్స్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటాయి. కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వ్యాయామ అధ్యాపకులు టి. సుబ్బారావు, ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ 19 స్కూల్ గేమ్స్ సెక్రెటరీ ఎం. ఆదినారాయణ రావు, వ్యాయామ ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

ప్రజాశక్తి -పొదలకూరు :పొదలకూరు మండలం చెన్నారెడ్డి పల్లి గ్రామంలో మంగళవారం రైతుల కు డ్రిప్ ఇరిగేషన్‌పై మీద అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. పి డి బి. శ్రీనివాసులు మాట్లాడారు. రైతులు డ్రిప్ పరికరాలు పొందాలని సూచించారు. హెచ్ ఓ ఆనంద్, సిబ్బంది నరేష్ పాల్గొన్నారు.

ఎంఎస్ఎఫ్ సదస్సు జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కావలి : ఎస్.సి. రిజర్వేషన్ వర్గీకరణ లక్ష్యసాధనలో భాగంగా డిసెంబరు 21న తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్‌లో మాదిగ విద్యార్థి సమాఖ్య (ఎంఎస్ఎఫ్) జాతీయ మహాసభను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహం ఆవరణంలో ఎంఎస్ఎఫ్ నాయకులు గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగ, చేవూరు కిరణ్‌కుమార్‌మాదిగ, అక్కిలగుంట యేసురత్నం మాదిగ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్.సి. రిజర్వేషన్ వర్గీకరణకు 2014లో బిజెపి తన ఎన్నికల మేనిఫెస్టోలో తాము అధికారంలోకి వచ్చిన 100రోజుల్లోపే చట్టబద్ధత కల్పిస్తామని పొందుపరిచిందన్నారు. ఇప్పటికి 8సంవత్సరాలు పూర్తయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం, బిజెపి నాయకత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తుందని విమర్శించారు. 2020 ఆగస్టులో సుప్రీంకోర్టు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వైఖరిని తెలియజేయాలని తీర్పునిచ్చిందన్నారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్.సి. వర్గీకరణ విషయమై నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నాయన్నారు. కాబట్టి రానున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ, మంద కృష్ణమాదిగ ఆదేశాలతో ప్రత్యక్ష ఉద్యమాన్ని బలోపేతం చేసి, విద్యార్థులు, నిరుద్యోగులైన మాదిగ విద్యావంతుల ద్వారా ప్రభుత్వాన్ని ఒత్తిడి తీసుకురావాలని డిసెంబర్ 21న మహబూబ్‌నగర్‌లో జరుగు జాతీయమహాసభను జయప్రదం చేయాలన్నారు. అందులో భాగంగా 25వ తేదీన నెల్లూరు అంబేద్కర్ భవన్‌లో మాదిగవిద్యార్థులు, ఎం.ఆర్.పి.ఎస్. కార్యకర్తల సమాయత్త సదస్సు జరుగుతుందన్నారు. కావున జిల్లాలోని అన్ని మండలాల ఎంఆర్‌పిఎస్, ఎం.ఎస్.ఎఫ్., ఎం.ఎస్.పి.నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ముఖ్య అతిథులుగా రుద్రపోగు సురేష్‌మాదిగ, వారి బృందం హాజరవుతారని తెలిపారు. సమావేశంలో కత్తి శీనయ్య మాదిగ, కావలి శ్రీనివాసులుమాదిగ, జానకిమాదిగ, జి.దొరబాబుమాదిగ పాల్గొన్నారు.

ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక బస్టాండ్ సెంటర్ నెల్లూరు-ముంబై జాతీయ రహదారిపై మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. ఇర్లపాడు గ్రామానికి చెందిన గుర్రం వెంకటేశ్వర్లు (55) మర్రిపాడు సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా వేగంగా వస్తున్న సిమెంట్ ట్యాంకర్ ఢీ కొట్టి ముందు చక్రం తలపైకి ఎక్కడంతో నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. ట్యాంకర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, ఎస్ఐ రాజేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నాడు-నేడు పనులు పరిశీలన

ప్రజాశక్తి-సీతారామపురం : మండలంలో పలు పాఠశాలల్లో మనబడి నాడు-నేడు ఫేజ్-2లో భాగంగా భవన నిర్మాణ పనులు నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎపిఇడబ్ల్యుఐడిసి ఎఇ శ్రావణ్‌కుమార్ సూచించారు. మంగళవారం బసినేనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మనబడి నాడు-నేడు పనులను పరిశీలించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలకు నాడు-నేడు ద్వారా మంజూరైన తరగతి గదులను త్వరతగిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్లకు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అంజయ్య, ఏడుకొండలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ బాలినేని ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శపాఠశాల ప్రిన్సిపల్ ఎంపిక

ప్రజాశక్తి-సీతారామపురం : గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ వారితో నిర్వహించిన లీడర్‌షిప్ స్కిల్ ఆన్‌లైన్ పరీక్షలో సీతారామపురం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.ఎం.రెహమాన్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ సంస్థ లీడర్షిప్ స్కిల్స్‌పై ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారని తెలిపారు. 50 మందిని ఎంపిక చేయగా, అందులో జిల్లా నుంచి 5 మంది ప్రధానోపాధ్యాయులను ఎంపిక చేశారన్నారు. ఎంపికైన వారికి మేనేజ్‌మెంట్ తరపున లీడర్షిప్ స్కిల్‌పై శిక్షణ ఇస్తారని తెలిపారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులందరూ తమ పాఠశాలలోని విద్యార్థులకు లీడర్షిప్ వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేస్తామన్నారు. అంతేకాకుండా జిల్లాలోని పలు పాఠశాలల్లో లీడర్షిప్ స్కిల్ గురించి విద్యార్థులకు వివరిస్తామన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-అనంతసాగరం : నవంబరు 14వ తేదీన ప్రారంభమైన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం గ్రంథపాలకుడు డి నారాయణరావు ఆధ్వర్యంలో ముగిశాయి. వారోత్సవాల్లో భాగంగా వారం రోజులపాటు విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీ పరీక్షలు నిర్వహించి ప్రతిభ చూపిన 25 మంది విద్యార్థులకు ముగింపు వేడుకల్లో అతిథులతో బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన తహశీల్దార్ రమణారావు మాట్లాడుతూ గ్రంథాలయాల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు అల్లంపాటి సుధాకర్ రెడ్డి, సర్పంచ్ శోభ, వైద్యాధికారి శ్రీకాంత్ రెడ్డి, ఎస్ఐ సంతోష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మోహన్‌రావు, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ మురళి, జన విజ్ఞాన వేదిక నాయకులు వేము పెంచలయ్య, వైసిపి నాయకులు బి.జనార్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ప్రతి ఒక్క విద్యార్థి గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని ఎఎస్‌పేట జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అబ్దుల్ హమీద్ తెలిపారు. మంగళవారం స్కూల్లో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని లైబ్రేరియన్ ఓ శ్రీనివాసరాజు అధ్యక్షతన నిర్వహించారు. హై స్కూల్ హెచ్ఎం అబ్దుల్‌హమీద్ మాట్లాడుతూ హై స్కూల్లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి పుట్టిన రోజు సందర్భంగా ఒక పుస్తకాన్ని లైబ్రరీకి బహూకరించాలని తెలియజేశారు. అలాగే స్టూడెంట్ మోటివేటర్ వి.నారాయణరావు మాట్లాడుతూ చిన్ననాటి నుండి గ్రంథాలయాలకు వెళ్లే అలవాటుగా సుధా నారాయణమూర్తి అలవర్చుకొని ఆమె పదివేల గ్రంథాలయలు స్థాపనకు తోడ్పడ్డారని తెలిపారు. ఉపాధ్యాయులు సుధాకర్‌రావు, హరికృష్ణ, బిడిఇఎల్ చలపతిరావు పాల్గొన్నారు.

కంపచెట్లు తొలగింపు

ప్రజాశక్తి-బిట్రగుంట : కప్పరాళ్ల తిప్ప తహశీల్దార్ కార్యాలయం నుంచి బోగోలుకు పోయే సర్వీస్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను మంగళవారం తిప్ప గ్రామ ఎస్‌టి వెల్ఫేరే అసోసియేషన్ సభ్యులు తొలగించారు. ఈ రోడ్డు మార్గాన ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుకి ఇరువైపులా దట్టమైన కంపచెట్లు ఏపుగా పెరిగి రోడ్డు మార్గాన ప్రయాణం సాగిస్తున్న ప్రజలకు తీవ్ర ఇబ్బందులుగా మారాయి. ఏ వైపు నుండి ఏ వాహనం వస్తుందో ఏ జంతువు వస్తుందో తెలియక ప్రజలు నిత్యం ఆ మార్గంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో బేతానిపేటకు చెందిన ఓ సాధారణ రోజు వారి కూలి రెక్కాడితే కానీ డొక్కాడని వ్యక్తి ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోవడం విధితమే. ఈ విషయంపై స్పందించిన బాడన్‌పేట, తిప్ప గ్రామ ఎస్‌టి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు స్పందించి ఇలాంటి ప్రమాదాలు జరిగి ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకూడదనే ఉద్దేశంతో మంగళవారం తహశీల్దార్ కార్యాలయం సమీపాన ఉన్న సర్వీసు రోడ్డు మలుపు వద్ద ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను జె.సి.బి సహాయంతో తొలగించారు. కార్యక్రమంలో బి.ఎజ్కేల్, యు.రవి, సిహెచ్.క్రాంతికుమార్, పి.ఉదయకుమార్, పి.మనోహర్, పి.శేఖర్, పిట్ల ప్రత్యూష్, ఎన్.ఫ్రాంక్లిన్, ఎ.చక్రపాణి, ఎ.రాజు, తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠపురం అభివృద్ధికి తోడ్పడాలి

ప్రజాశక్తి-కావలి : పేదలు నివసించే వైకుంఠపురంపై పాలకులు, అధికారులు చిన్నచూపు, నిర్లక్ష్య ధోరణి, మొద్దు నిద్రను మేలుకొల్పేందుకు జనసేన తరపున జలదీక్ష చేస్తున్నామని జనసేన నాయకుడు సిద్ధు తెలిపారు. మంగళవారం సిద్ధు ఆధ్వర్యంలో వైకుంఠపురం ఏరియా అభివృద్ధి చేయాలని, అన్నపగుంట మీదుగా రోడ్డు వేయాలని కోరుతూ, అన్నపు గుంటలో దిగి, జనసేన కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిద్ధు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టకుండా పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వైకుంఠపురం, పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీ, నార్త్ జనతాపేట వాసులు రైల్వే ట్రాక్‌పై నడుస్తూ పడుతున్న బాధలు కానరావడం లేదా అని పాలకులను ప్రశ్నించారు. రైల్వే ట్రాక్ దాటుతూ, రైళ్లు గుద్దుకుని వృద్ధులు, దివ్యాంగులు గత పది సంవత్సరాలుగా 20 మందికిపైగా చనిపోయారన్నారు. ఇప్పటికైనా వెంటనే ఎన్నికల ముందు ఎంఎల్‌ఎ ఇచ్చిన హామీలు బ్రిడ్జి నిర్మాణం, అనపగుంటకు శాశ్వత పరిష్కారం, వైకుంఠపురంలో సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కావలి రూరల్ అధ్యక్షులు తిరుపతి స్వామి, పసుపులేటి సురేష్, తోట సాయి, మనోజ్, కుమార్, జోషి, రమేష్, విజయ్, విష్ణు, చక్రి, పాల్గొన్నారు.

మంత్రి రోజాను కలిసిన తిరుపతిరెడ్డి

ప్రజాశక్తి-సీతారామపురం : రాష్ట్ర పర్యాటక మంత్రి ఆర్‌కె రోజాను బెంగళూరు విమానాశ్రయంలో మంగళవారం రాష్ట్ర వైసిపి యువజన విభాగ ప్రధాన కార్యదర్శి, గుండుపల్లి సర్పంచ్ చప్పిడి తిరుపతిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు పరిపాలించిన ఉదయగిరి కోటను పర్యాటక ప్రదేశంగా మార్చాలని అదేవిధంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఘటిక సిద్ధేశ్వరంను అభివృద్ధి పరచాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మంత్రి తెలిపారన్నారు.

ప్రయివేటీకరణతో కార్మికులకు నష్టం

ప్రజాశక్తి-కావలి

మాట్లాడుతున్న కె.అజయ్ కుమార్

కేంద్ర ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ రంగంలో ఉన్న పరిశ్రమలను ప్రయివేటీకరణ చేస్తూ కార్మిక కుటుంబాలను వీధుల పాలు చేస్తుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్ విమర్శించారు. కావలి సిఐటియు 4వ మహాసభ మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జి.సుబ్బరామయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశా, మిడ్డే మీల్స్, మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. పని భద్రత లేకుండా కనీస వేతనాలు అమలు చేయకుండా అన్యాయంగా నిత్యావసర సరుకుల ధరలను విపరీతంగా పెంచి, కార్మికుల ప్రజలపై మోయలేని భారాన్ని మోపిందన్నారు. ప్రజలు కార్మికులు ఉద్యోగులు పెరిగిన ధరలతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజల నుండి కేంద్ర ప్రభుత్వం ఖజానా నింపు కుంటుందని కార్మికులకు, ఆశ, అంగన్‌వాడీ, మున్సిపల్ కార్మికులకు పని భారాన్ని పెంచి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. పనికి తగ్గ వేతనం ఇవ్వకుండా వారి కష్టాన్ని దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. కనీస వేతనాలు అమలు చేయాలని అన్ని రంగాల కార్మికులు పోరాడే ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యమంత్రి జిల్లాలో ఉన్న దామోదరం సంజీవయ్య విద్యుత్ ప్లాంటును ఆదానికి అప్పజెప్పాలని చూస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో పరిపాలన సాగి స్తున్నారన్నారు. స్కూల్స్ స్వీపర్లకు మరీ చాలీచాలని జీతాలు ఇస్తున్నారని, దీనివల్ల వారి కుటుంబాలు అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, ప్రజావ్యతిరేక ఉద్యోగ వ్యతిరేక పరిపాలనకు వ్యతిరేకంగా అన్నిరంగాల ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, ఐక్యంగా పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. పోరాటాలకు సిఐటియు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలియజేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె.రెహానా బేగం మాట్లాడుతూ డిసెంబర్ 11 ,12 తేదీలలో ఆత్మకూరు పట్టణంలో జరిగే సిఐటియు జిల్లా మహాసభలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కావలి పట్టణ అధ్యక్షులుగా ఎవి కృష్ణయ్య, ఉపాధ్యక్షులుగా వి.పద్మావతిదేవి, కె.విజయలత, ప్రధాన కార్యదర్శిగా ఎర్రంశెట్టి కృష్ణమోహన్, సహాయ కార్యదర్శిగా పెంచల నరసింహం, ట్రెజరర్‌గా పోలయ్య వీరితోపాటు 21 మందితో నూతన కమిటీ ఎన్నికైంది. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.పెంచలయ్య, ఎస్.వెంకయ్య, కె.జాన్, డివైఎఫ్ఐ నాయకులు పెంచల నరసింహం, ఇతర కార్మిక సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు.

భూముల సమస్యలు పరిష్కరించాలి

- రాష్ట్ర ఎస్‌సి కమిషన్ మెంబర్ కె.బసవరావు

ప్రజాశక్తి-కావలి

జిల్లాలో పెండింగ్‌లో వివాదాలలో ఉన్న దళితుల భూములను అధికారులు చొరవ తీసుకొని వెంటనే పరిష్కరించాలని వారికి న్యాయం చేయాలని రాష్ట్ర ఎస్‌సి కమిషన్ సభ్యులు కట్టెపోగు బసవరావు కోరారు. పట్టణంలోని డిఎస్‌పి గెస్ట్ హౌస్ కార్యాలయానికి మంగళవారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు నాయకులు అధికారులు కలిసి శాలువాలు కప్పి బొకేలు ఇచ్చి సన్మానించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించి, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. దళిత సంక్షేమం వైపు ప్రభుత్వం పరుగులు తీస్తుందని, దళిత జాతి అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి దళిత జాతి ఎప్పుడూ తోడు ఉంటుందన్నారు. కావలి డివిజన్లో ఉన్న ఎస్‌టి సాంఘిక సంక్షేమ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. వివాదాలలో ఉన్న ఎస్‌సిల భూముల రెవెన్యూ అధికారులు వెంటనే పరిష్కరించి, న్యాయం చేయాలన్నారు. ఒకవేళ ఎవరైనా ఎస్‌సిలకు అన్యాయం చేస్తే వారి మీద చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్‌డిఒ శీనా నాయక్, తహశీల్దార్ మాధవరెడ్డి, ఒకటవ పట్టణ సిఐ శ్రీనివాసరావు, సోషల్ వెల్ఫేర్ అధికారులు దళిత నాయకులు దాసరి బాలకృష్ణ, బొమ్మిశెట్టి బాల చెన్నయ్య, దాసరి వెంకట్రావు, ఎలికా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : స్థానిక ఠాగూర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్ వెంకటరమణారెడ్డి, హెచ్ఎం కె.దొరస్వామి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన చిత్రలేఖనం పోటీలలో ప్రతిభ కనపరచిన పి.లక్ష్మీశరణ్యకు మొదటి బహుమతి, కె.సురేంద్రకు ద్వితీయ, ఎస్.సంజీవనీలకు తృతీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌టి కాలనీలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి-బిట్రగుంట

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

మండలంలోని పాత బిట్రగుంట ఎస్‌టి కాలనీలో అభివృద్ధి శూన్యం అని మండల సిపిఎం కార్యదర్శి తుమ్మల వెంకయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాత బిట్రగుంట ఎస్‌టి కాలనీలో మంగళవారం సిపిఎం మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య, సిఐటియు మండల కార్యదర్శి చల్లా నరహరి, మండల కమిటీ సభ్యులు ఉప్పాల యానాదయ్య, ఉప్పాల ఎల్లయ్య సందర్శించారు. ఈ మేరకు అక్కడి సమస్యలపై తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌టి కాలనీలో సుమారు 60 ఇల్లు ప్రభుత్వం నిర్మించి ఇస్తే వాటిలో 20 ఇళ్లు బాగా దెబ్బతిన్నాయని, కొన్ని ఇళ్లు సగం నిర్మాణం కట్టి వదిలేశారని తెలిపారు. చిన్నపాటి వర్షానికి కాలనీలు మొత్తం నీటి మయమవుతుందన్నారు. ఒకే ఇంట్లో మూడు కుటుంబాలు కూడా నివసిస్తున్నాయని తెలిపారు. కొన్ని గృహాలు కాంగ్రెస్ హయాంలో నిర్మిస్తే, కొన్ని టిడిపి హయాంలో నిర్మించాలని, వైసిపి హయాంలో ఎవరికి గృహాలు మంజూరు చేయలేదని, కొన్ని గృహాలు శిథిల వ్యవస్థకు చేరుకొని పడిపోయే స్థితిలో ఉన్నాయని తెలిపారు. ఇకనైనా జిల్లా ఉన్నత అధికారులు గృహాలను కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

జగనన్న క్రీడా సంబరాల్లో 64 మంది ఎంపిక

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు ప్రభుత్వ హైస్కూల్‌లో మంగళవారం జరిగిన నియజకవర్గ స్థాయి జగనన్న క్రీడా సంబరాల పోటీలలో 64 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని ఎంపిడిఒ సి.శ్రీనివాసులు తెలియజేశారు. మంగళవారం వాలీబాల్, కబడ్డీ పోటీలు యువతీ యువకులకు క్రికెట్ పోటీల్లో యువకులు మాత్రమే పాల్గొన్నారు. ఉదయం జరిగిన పోటీలు ఎంపిడిఒ సి.శ్రీనివాసులు, ఎంఇఒ షేక్ నజీర్ బాషా హైస్కూల్ ప్రధనోపాధ్యాయులు శేషాద్రి వాసు, ఆత్మకూరు మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రావణ్ కుమార్, వార్డు కౌన్సిలర్ సూరా భాస్కర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పి.తిరుపతయ్య, సిహెచ్ మోహన్, షేక్.షరీఫ్, కే.మధు సుధన్, పి.హరికృష్ణ, పి.మురళి, కె.వెంకటకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎపిజిబి సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కావలి

మాట్లాడుతున్న ఎంపిడిఒ ఎ.వి.సుబ్బారావు

ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంక్ (ఎపిజిబి) ఇతర బ్యాంకులతో పోటీపడుతూ, అనతి కాలంలోనే ప్రజలకు, మహిళలకు ఉత్తమ బ్యాంక్‌గా విస్తరిస్తుందని, ఈ బ్యాంక్ సేవలను, వడ్డీ పథకాలను ఎంపిడిఒ ఎ.వి.సుబ్బారావు వివరించారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ ఆవరణంలోని వైఎస్‌ఆర్ క్రాంతివెలుగు కార్యాలయంలో ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు కావలి బ్రాంచ్ ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. బ్యాంక్ అందిస్తున్న డిపాజిట్ పథకాలను, రుణపథకాలను, బీమా పథకాలను ఇతర సేవలను వివరిస్తూ, కళాజాతర అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బ్రాంచి మేనేజర్ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రగతి-666, ప్రగతి-400రోజులకు ఎపిజిబి అధికవడ్డీ అందిస్తుందని, గృహనిర్మాణాలు, వాహన, ముద్ర, విద్యా, వ్యవసాయ ఆధారిత రుణాలను విరివిగా అందిస్తుందన్నారు. సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి మాట్లాడుతూ మహిళలు, గ్రామీణ ప్రాంతానికి చెందిన ఖాతాదారులు బ్యాంకు మెరుగైన సేవలను వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో జనతాపేట గ్రామీణబ్యాంకు అధికారులు శేషాచలం, మానస, నరేంద్రలక్ష్మి, గాయత్రి, రజిని, చంద్రకాంత్, వెలుగు ఎపిఎం కాంతారావు, మెప్మా ప్రతినిధి కొండయ్యలు పాల్గొన్నారు. అనంతరం కళాజాతర నిర్వాహకులు, ప్రముఖ ఇంద్రజాలికులు వేములపాటి మాధవరావు తన ఇంద్రజాల విద్యతో బ్యాంకుల్లో డబ్బు దాచుకోవడం, ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్లు చేయడం, తీసుకున్న రుణాలను చెల్లించే విధానాలను కళ్లకు కట్టినట్లుగా చూపించి ఎంతగానో అలరించారు. కార్యక్రమంలో బ్యాంకు ఖాతాదారులు, పొదుపు మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

పోలంరెడ్డి హయాంలోనే అభివృద్ధి

ప్రజాశక్తి-కొడవలూరు

మాట్లాడుతున్న పోలంరెడ్డి దినేష్‌రెడ్డి

వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టేసిందని టిడిపి కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని దామేగుంట, చలివేంద్రం తలమంచి గ్రామాల్లో ఆయన కార్యకర్తలతో పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మండల టిడిపి నాయకులతో కలసి గ్రామాల్లో పర్యటించి ప్రజలను కలుసుకుని రాబోయే రోజుల్లో మళ్లీ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా పోలంరెడ్డి దినేష్ రెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలు వైసిపి నాయకుల కమీషన్లకు బయపడి పక్క రాష్ట్రాలకు తరలి పోతున్నాయన్నారు. తెలుగు దేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే, రాష్ట్రానికి అప్పులు కాకుండా, సంపదను సృష్టించి తద్వారా సంక్షేమాన్ని అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, చెముకుల కష్ణచైతన్య, ఎంపిటిసి సభ్యులు గరికపాటి రాజేంద్రకుమార్, కారకటి మల్లికార్జున, జొన్న శివకుమార్, ఇండ్ల జయరామయ్య, చెముకుల వెంకయ్య, నక్క రమణయ్య, కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి, సతీష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ కాంగ్రెస్ పోటీలు

ప్రజాశక్తి-కావలి

స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీ పి.జి. కళాశాలలో జాతీయ సైన్స్ కాంగ్రెస్ పోటీలకు ప్రాజెక్ట్‌ల మెరుగుదల కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెంటార్లుగా ప్రొఫెసర్ డాక్టర్ శైలజ, డాక్టర్ ఎ.శివశంకర్ రెడ్డి, డాక్టర్ పి.గోపికృష్ణలు పాల్గొని విద్యార్థులకు ప్రాజెక్టులు మెరుగు దిద్దుటలో తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి "సికేదాస అకాడమీ చారిటబుల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, కందుకూరు "వారు సహాయ సహకారాలు అందించారు. ఈ కార్యక్రమం ఎపి శాసన సాంకేతిక మండలి ఆప్ కాస్ట్ (అప్ కాస్ట్) ఎన్ సి ఎస్ సి ఆధ్వర్యంలో చేపట్టారు. ఇటీవల నెల్లూరు జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయికి ఎంపికైన ఉత్తమ పరిశోధనాత్మక పత్రాలు అందించిన ఏడుగురు విద్యార్థులు శాస్త్రవేత్తలు వారి మార్గదర్శక ఉపాధ్యాయులు, మెంబర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనికి రిసోర్స్ పర్సన్‌గా ఎ.నేకునంపేట్ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు ప్రభాకర్, కార్యనిర్వాహకులుగా జిల్లా కోఆర్డినేటర్ జె వి రమేష్ ఉన్నారు.

నరేంద్రబాబుకు అభినందనలు

ప్రజాశక్తి-నెల్లూరు

నగరం లోని భక్త వత్సల నగర్ లోని కె. ఎస్.ఆర్. నగర పాలక ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న గుండాల నరేంద్రబాబు ఎన్‌సిసికి చేస్తున్న అపార సేవలను అభినందిస్తూ కమాండింగ్ ఆఫీసర్ వినయ్ రామచంద్రన్ సెకండ్ ఆఫీసర్ ర్యాంక్‌ను నరేంద్ర బాబు భుజాలపై ధరింపజేశారు. మంగళవారం జరిగిన అభినందన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.విజయ్ ప్రకాష్‌రావు, ఎన్‌సిసి సూపరింటెండెంట్ జి.ముకుంద సాగర్, ఎస్ వి రామన్, జి డి అల్తాఫ్, శివ ప్రసాద్, సూరజ్ భాగేల్, దుర్గా ప్రసాద్, దీపక్ కుమార్, సమం కుమార్, షెహ్నాజ్‌బేగం, పి.విజయ్‌కుమార్, సుజాత, అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్ సి.వి. నాగ రాజు, కేర్‌టేకర్ నాగరాజు, సందీప్, తదితరులున్నారు.

పలుచోట్ల గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-విడవలూరు

మండలంలోని చౌకచెర్ల గ్రామంలో రెండోరోజు మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎంఎల్‌ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చేపట్టారు. గ్రామ వాలంటీర్లు, సచివాలయ సిబ్బందిని వెంటపెట్టుకొని ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నయా లేదా అని తెలుసుకున్నారు. గ్రామ ప్రజలు, గ్రామ నాయకులు ఆయనకు మంగళ హారతులతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎంఎల్‌ఎ ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూరిన సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి మాట్లాడుతూ నుడా నిధులలో రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు, దీనిలో ఎస్‌టి కాలనీకి రూ.25 లక్షలు, ఎస్‌సి కాలనీకి రూ.25 లక్షలు కేటాయించామన్నారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ గత మూడు సంవత్సరాలలో ఒక్కొక్క కుటుంబానికి ఎంత మేరకు లబ్ధి చేకూరిందో, ప్రజా ప్రతినిధులు అధికారులు సచివాలయ సిబ్బంది వాలంటీర్లతో తెలుసుకుంటున్నామ్మన్నారు. అదేవిధంగా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 90 శాతం అమలు పరిచిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. టిడిపి ప్రభుత్వంలో పెన్షన్లను 40 లక్షల మందికి మాత్రమే ఇచ్చే వారిని, వైసిపి ప్రభుత్వంలో అదే పెన్షన్లను 62 లక్షల మంది అందిస్తున్నామని తెలియజేశారు. సిఎం ప్రవేశపెట్టిన 32 పథకాలలో గోరుముద్ద ప్రత్యేకమైందన్నారు. ఈ పథకం ఉద్దేశం పసి బిడ్డలకు నాణ్యమైన ఆహారం అందించాలని మెనూలో ఇచ్చి అమలు చేసినట్లు తెలిపారు. ఇటీవల వేగూరు హై స్కూల్‌ను సందర్శించగా, పిల్లలకు ఇవ్వాల్సిన కోడిగుడ్లు తక్కువగా ఉన్నందున దానికి బాధ్యులైన వారిని తొలగించామన్నారు. కార్యక్రమంలో డిఎబి చైర్మన్ నిరంజన్ బాబురెడ్డి, తహశీల్దార్ కె.చంద్ర శేఖర్, ఎంపిడిఒ సుబ్రమణ్యం, గౌరవ అధ్యక్షులు నవీన్‌రెడ్డి, జెడ్‌పిటిసి లక్ష్మయ్య, ఎంపిపి భావానమ్మ, సర్పంచ్ వినోద్, మండల కన్వీనర్ బెదవాడ గోవర్ధన్ రెడ్డి, మండల వైసిపి గౌరవ అధ్యక్షుడు నవీన్ రెడ్డి, అచ్యుత్‌రెడ్డి, ఓగు నాగేశ్వరరావు, మురళిరెడ్డి, సమాధి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అల్లూరు : మండల కేంద్రంలోని దళిత వాడలో మంగళవారం కావలి ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి గడప గడప కార్యక్రమాన్ని చేపట్టగా దళితులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఎంఎల్‌ఎ అయినప్పటి నుండి దళితవాడకు తొలిసారిగా విచ్చేయడంతో బాణసంచా పేల్చి అభిమానాన్ని చాటుకున్నారు. ముందుగా స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుండి నిరంతరం రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని కొనియాడారు. గత ప్రభుత్వాలు కల్లబొల్లి హామీలిచ్చి చేతులు దులుపుకున్నారని దుయ్యబట్టారు. సంక్షేమ దిశగా అడుగులు వేస్తూ ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తున్న జగన్మోహన్ రెడ్డిని మళ్లీ సిఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అమ్మ ఒడి పథకం ద్వారా అనేకమంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని గుర్తు చేశారు. 1వ తేదీకల్లా అవ్వ తాతలకు వృద్ధాప్య పెన్షన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబంలో పెద్దకొడుకు మాదిరిగా జగనన్న వ్యవహరిస్తూ వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు చేయూతనిస్తున్నారని తెలియజేశారు. ఇది ఓర్వలేని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమ పథకాలపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ మద్దతు ఇవ్వకపోవడంతో ఆయన ముఖంలో పూర్తిగా కవళికలు మారాయని చలోక్తులు విసిరారు. కర్నూలు సభలో వైసిపిని విమర్శించడం తప్పితే ఇంకేమీ లేదన్నారు. ఆయన కుప్పంలో కూడా గెలిచే పరిస్థితి లేకపోవడంతో మతిభ్రమించి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈనాడు ఏ ఇంటికి వెళ్లినా మహిళలు బ్రహ్మరథం పడుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మన్నెమాల సుకుమార్ రెడ్డి, మండల వైసిపి ప్రధాన కార్యదర్శి సామంతుల సురేష్‌రెడ్డి, ఎంపిపి దర్శకుంట శశిరేఖ, కోడూరు సాధక్ కుమార్‌రెడ్డి, దాసరి పోలయ్య, డిప్యూటీ తహశీల్దార్ చెంచయ్య, నగర పంచాయతీ కమిషనర్ ఫణి కుమార్, తదితరులున్నారు.

పేదలకు భోజన ప్యాకెట్లు వితరణ

ప్రజాశక్తి-కావలి

సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం శివరామ సుబ్బయ్య కాలనీలో 50 మంది నిరుపేదలకు భీమరాజు చంద్రశేఖరరావు జ్ఞాపకార్థంగా బెంగళూరులో నివాసం ఉంటున్న వారి సతీమణి భీమరాజు అన్నపూర్ణ, వారి కుమారులు, కుమార్తెలు, వారి కుటుంబ సభ్యుల సహకారంతో భోజన ప్యాకెట్లు వితరణ చేశారు. ఈ సంస్థ అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ తమ సేవాసంస్థ ద్వారా నిత్యం ఆకలి తీర్చిన దాతలకు ధన్యవాదాలు తెలుపుతున్నామని తెలిపారు. వృత్తిరీత్యా బెంగుళూరులో నివాసం ఉంటున్నా వారి స్వగ్రామమైన కావలిలోని పేదలకు ఆకలి తీర్చడం సంతోషంగా ఉందన్నారు.

బ్రహ్మయ్యను వెంటనే శిక్షించాలి

ప్రజాశక్తి-కోవూరు : నెల్లూరు టౌన్ లో ఓవెల్ స్కూల్లో విద్యార్థిని పై లైంగిక వేధింపులు చేసిన బ్రహ్మయను వెంటనే శిక్షించాలని, అదేవిధంగా ఓవెల్ స్కూల్ యాజమాన్యాన్ని శిక్షించాలని కోవూరు బజార్ సెంటర్లో నిరసన కార్యక్రమం చేశారు. డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సురేంద్ర, ఆజాద్ జిల్లా కమిటీ మెంబర్ చాంద్ బాషా మాట్లాడుతూ స్కూల్లో చేరి నాలుగు సంవత్సరాలు కూడా సక్రమంగా కాలేదు ఆ బాలికపై లైంగిక వేధింపులు చేసిన వారిని వెంటనే శిక్షించాలని ఆ స్కూలు ప్రభుత్వపరం చేయాలని, విద్యాశాఖ మంత్రి ఈ విషయాన్ని పరిశీలించి విద్యార్థిని తల్లిదండ్రులను న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎస్‌కె.బాబు, ఎస్‌కె.కాలేషా, సురేష్, జావీద్, కరీముల్లా, కాకి వెంకట రమణయ్య, రాము, టి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కొండా అనిల్ నియామకం

ప్రజాశక్తి-నెల్లూరు : స్థానిక బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భవన్లో మంగళవారం నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ జిల్లా నూతన అధ్యక్షుడిగా కొండా.అనిల్ కుమార్‌ను నియమించారు. ఈ సందర్భంగా నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదూరు.రత్నం జిల్లా అధ్యక్షుడిగా కొండా.అనిల్‌కుమార్ నియామకాన్ని అధికారికంగా మీడియా సమావేశంలో ప్రకటించారు. నెల్లూరు జిల్లా రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు కలిగి ఉన్న జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న కొండా.అనిల్ కుమార్ సేవలను నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ చేస్తున్న పోరాటాలకు ఉపయోగపడే ఉద్దేశంతో రాష్ట్ర నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు పరిశీలించారు. శ్రీనివాసులు అంబేద్కర్ భవన్లో ఐదుగురికి మీడియా నుంచి కొండా.అనిల్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొని ప్రకటించారు. అనంతరం జిల్లా నూతన అధ్యక్షుడు కొండా.అనిల్ కుమార్ మాట్లాడుతూ ఎస్‌సి జాబితాలో మొత్తం 59 కులాలకు సంబంధించిన రిజర్వేషన్లు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవట్లేదన్నారు. ఎస్‌సి వర్గీకరణలో ప్రభుత్వాలు జాప్యం చేయడం వల్ల పూర్తిస్థాయిలో అణగారిన వర్గాలు (మాదిగలు) అభివృద్ధికి నోచుకోలేదని అందువల్ల నానాటికి దీనావస్థలో దిగజారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌సి వర్గీకరణ జరిగితే తమ ఉనికిని కోల్పోతాం అపోహలో ప్రభుత్వాలు ఉన్నాయని అందుకే కేవలం తమ స్వార్థం కోసం మాదిగ వర్గాన్ని ప్రభుత్వాలు ఉపయోగించుకుంటున్నారని వాపోయారు. ఎస్‌సి వర్గీకరణ బిల్లుపై చర్చ జరగాలని ప్రతిపాదించారు. శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో కచ్చితంగా ఎస్‌సి వర్గీకరణ బిల్లుకు ఆమోదించాలని డిమాండ్ చేశారు. పైగా ఎస్‌సి వర్గీకరణ ఉద్యమ నేతలు చేస్తున్న పోరాటాల ద్వారా ప్రజలకు అందుబాటులో సబ్బిడి రుణాలు అందేలా ఉందని తెలిపారు. కార్యక్రమంలో నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పోలేపల్లి.రమణారావు, సంఘాలు రాష్ట్ర జెఎసి కుమార్, రాష్ట్ర కార్యదర్శి పల్లె.భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

In The Court of The Vth Addl. District Judge : Nellore
E.P.No. 4 / 2022
O.S.No. 129 / 2014
Cherukuri Ramadevi
- Petitioner / Decree Holder
Vs
Mamidi Vijayalakshmi
-Respondent / Judgment Debtor
Notice to Respondent / Judgment Debtor
Mamidi Vijayalakshmi,
Wife of Satti Raju,
Plot No.20, 23, Patur Road, Kovur Mandal, SPSR Nellore District.
పై నెంబరుగల డిక్రీ హోల్డర్ పై తెలిపిన కోర్టు లో మీపై ఇ.పి. దాఖలు చేసియున్నారు. సదరు ఇ.పి.లో మీకు ఆర్డర్ 21, రూల్ 22 నోటీసు నిమిత్తం తేది-01-12-2022కి వాయిదా వేయనైనది. సదరు వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై అభ్యంతరాలు తెలుపుకోవలెను. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
సిహెచ్. వెంకటేశ్వర రావు, బి.కాం., బి.ఎల్., డిక్రీ హోల్డర్ తరఫు న్యాయవాది, నెల్లూరు.

మహారాజశ్రీ మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో
ఓ.ఎస్.నెం: 279/2021
గొట్టం పెద్ద బాలకాశయ్య ......వాది
వర్సెస్
దూలగంటి తిరుపతయ్య ..... ప్రతివాది
టు,
దూలగంటి తిరుపతయ్య
తండ్రి: చిన్నయ్య, గవర్నమెంట్ టీచర్
నివాసం : సంతపేట, ఒంగోలు
ప్రస్తుత పనిచేస్తున్న ప్రదేశం: ఎంపిపియస్ స్కూల్, కొత్తసత్రం గ్రామం, కావలి మండలం, నెల్లూరు జిల్లా.
వాది పేరున మీరు రాయించి ఇచ్చిన ప్రామిసరీ నోటు బాకీ వసూలు నిమిత్తం పై దావా కోర్టు నందు దావా దాఖలు చేసి ఉండి పై దావా వ్యాజ్యములో శ్రీ కోర్టు వారు మీకు ఎన్ని మార్లు నోటీసులు పంపించినను మీకు చేరనందున మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు తేదీ: 28-11-2022వ తేదికి వాయిదా వేయనైనది. కావున సదరు తేదీన ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా గానీ, లాయర్ ద్వారా గానీ శ్రీ కోర్టు వారి ముందు హాజరై పై వ్యాజ్యములో మీ అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేనిచో మీ పై నెంబరు వ్యాజ్యం మును శ్రీకోర్టు వారు మీపరోక్షమున తీర్మా నించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా: 28-11-2022 ఎ.పద్మావతి
మార్కాపురం వాది తరఫు అడ్వకేట్ మార్కాపురం
సెల్: 9908777432.